రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973
9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 5-10-2024

సంపుటి: 20 సంచిక: 165
పేజీలు: 4 వెల: రూ.1



SOLVE ACADEMY
Dwaraka Nagar 3rd Line, Data Pro Apartment 3rd Floor, Visakhapatnam.
Ramakrishna Nagar, Behind RTC Complex, Srikakulam, A.P. - 532001.
SSC CONSTABLES &RRB GROUP -D OUR TARGET
COMPETITIVE EXAMS COACHING!!!
*CRASH COURSE (2 Months) 5000 ₹ Only
JOIN TODAY
• 6 HOURS DAILY CLASSES
• COVER COMPLETE SYLLABUS
• ARITHMETIC/REASONING/GS/ GK/ENGLISH
• CHAPTER WISE TESTS
• GRAND TESTS
• COURSE PRINTED MATERIAL
FOR MORE INFORMATION :
75690 89825, 90595 20982
86881 72010, 90300 28181



19th Anniversary
Enjoy with JMR Food
మా సంస్థ 19 సం॥లు విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు మా కస్టమర్ దేవుళ్ళకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వార్షికోత్సవం సందర్భంగా మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇదే అభిమానాన్ని మున్ముందు అందిస్తారని ఆశిస్తూ...
ఆధునీకరించిన వాతావరణంలో
★ టిఫిన్స్: వెజ్ & నాన్‌వెజ్ (7 AM to 11 AM)
(సామాన్యులకు అందుబాటు ధరలలో)
★ సౌత్ ఇండియన్ వెజ్ మీల్స్ ★ ఇండియన్ ★ చైనీస్ ★ తందూరి ★ డిజర్ట్స్
Estd 2005
JMR RESTAURANT
టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, శ్రీకాకుళం ✆ 83318 23334


## కృతజ్ఞతాభివందనాలు





ఉపాధ్యాయురాలిగా 40 ఏళ్లు విశిష్ట సేవలందించి ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, అందరి మన్ననలు పొంది సెప్టెంబరు 30న ఉద్యోగ విరమణ చేసిన శ్రీమతి **బమ్మిడి తులసమ్మ** గారికి ఈ నెల 4న నిర్వహించిన అభినందన సభకు హాజరై సత్కరించిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు మా ధన్యవాదాలు.



శ్రీమతి **బమ్మిడి తులసమ్మ** ఎం.ఎ., బి.ఈడీ.,
విశ్రాంత ఉపాధ్యాయురాలు

భర్త: **దుంపల రామారావు**, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్

కుమారుడు: **డాక్టర్ డి.వెంకట రవికిరణ్**
అసిస్టెంట్ ప్రొఫెసర్, సిద్ధార్థ మెడికల్ కాలేజ్, విజయవాడ

అల్లుడు - కుమార్తె: **పి.ప్రవీణ్‌కుమార్ - అనితారాణి**
మనుమడు, మనుమరాలు: **చి. సాయిప్రతీక్, చి. శివాన్సీ**

---

## ప్రథమ వర్ధంతి



ప్రేమానురాగాలకు పుట్టినిల్లువై.. మమతానురాగాలకు మెట్టినిల్లువై..
ఆప్యాయతానురాగాలు మాకు పంచి,
మా అందరి హృదయాలలో ఉన్నతమైన స్థానాన్ని పొందిన నీవు
దైవసన్నిధికి చేరి ఏడాది గడిచిననూ నీ మధుర జ్ఞాపకాలు
మా మదిలో మెదులుతూనే ఉన్నాయి.. భగవంతుని సన్నిధికి చేరిన
నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ..

భర్త: **ఇళ్ల రామప్రసాద్, శ్రీలక్ష్మి ట్రేడర్స్, శ్రీకాకుళం**

కుమార్తె - అల్లుడు - మనుమడు
**బి.క్రిష్ణవేణి - శ్రీచక్రధర్ - బి.వి.సత్యనారాయణ**

కుమారుడు - కోడలు
**ఐ.ఎస్.ఎస్.రవితేజ - అఖిల**

| మరుదులు | - తోటికోడళ్లు |
|---|---|
| ఐ.భానుమూర్తి | - కుమారి |
| ఐ. త్రినాధ్ కుమార్ | - ప్రసూన |
| ఐ. కొండలరావు | - రమాదేవి |
| ఐ. రమేష్ | - ఉష |

| ఆడపడుచులు | - తమ్ముళ్లు |
|---|---|
| ఎ. సరస్వతి | - ధనుంజయ |
| వై. ఆదిలక్ష్మి (లేటు) | - మోహనరావు (లేటు) |

మేనల్లుళ్లు :
వంశీ - దేవి, సాయితేజ - సౌందర్య
మేనకోడలు: శిరీష - సంతోష్

అలేఖ్య, వంశీ, అవినాష్
అభిషేక్, సుస్మిత, సిద్ధార్థ
చరణ్, రేష్మా, సందీప్
ప్రత్యూష, లక్ష్మీమేఘన
వైష్ణవి, ధాన్వి, గాయిత్రి
అంజలి, ఆదిలక్ష్మి

6-10-2023

కీ॥శే॥ శ్రీమతి **ఇళ్ల సత్యవేణి** గారు,
హెచ్.నెం.292, పురుషోత్తమనగర్ కాలనీ, శ్రీకాకుళం

• ఎడిటోరియల్

# పవన్ పరుగు ఎందాక..?

దక్షిణాదిలో తాజా సంచలనం పవన్ కళ్యాణ్. గత ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లో ఓడిపోయిన స్థాయి నుంచి, మొన్నటి ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచి రికార్డు సృష్టించిన ఘనత పవన్ కళ్యాణ్‌ది అయితే.. తిరుపతి లడ్డు వివాదం ఆయనని దక్షిణాది సనాతన ధర్మసారధిగా పరిచయం చేసింది. ఇటీవల తిరుపతిలో సనాతన హిందూ ధర్మంపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దక్షిణాదిలో ఎవరికీ లేనంత పాపులారిటీ గత 15 రోజుల్లో పవన్ కళ్యాణ్‌కి వచ్చింది. ఒక రకంగా చెప్పాలంటే రాబోయే రోజుల్లో బిజెపి దక్షిణాది ముఖ చిత్రం పవన్ కళ్యాణ్ అనడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఇమేజ్ ముందు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ వాళ్లందరూ వెలవెలబోతున్నారు. అయితే పవన్ని మోసే ఎల్లో మీడియా అవసరమైతే అంతే వేగంగా ఆయన్ని కిందకి దించేయగలదు. చంద్రబాబు ప్రయోజనాల కోసం మాత్రమే ఆ మీడియా పనిచేస్తుంది. చంద్రబాబుకు వత్తాసుగా ఉన్నంత వరకు పవన్ కళ్యాణ్‌కి అతని ఇమేజ్‌కి ఎలాంటి ఇబ్బంది ఉండదు. పవన్ ఇండివిడ్యువల్‌గా ఎదగడం ప్రారంభిస్తే, కాలి అడుగున తొక్కేయడానికి ఆ మీడియా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఇక హిందుత్వం అభిమానులు పవన్ కళ్యాణ్‌ని దక్షిణాది యోగి అని వర్ణించడం స్టార్ట్ చేశారు. తమిళనాడులో మొన్నటి వరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అన్నామలై కంటే వేగంగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ విస్తరిస్తూ ఉంది. నాలుగు రోజుల క్రితం ఒక తమిళ యూట్యూబ్ ఛానల్లో సనాతన ధర్మం గురించి ఆయన సుదీర్ఘంగా తమిళంలో మాట్లాడడం తమిళ తంబిల మనసులను దోచుకుంది. ఈ ఇంటర్వ్యూ నెట్లో విపరీతంగా వైరల్ అయింది. ఈ ప్రభావం దక్షిణాది పైనే కాకుండా ఉత్తరాదిలో కూడా తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో పవన్ ఎంతవరకు తన పరుగు సాగించగలరు అనేది పెద్ద ప్రశ్న. పవన్‌లో నిలకడలేమి అతని స్థాయిని అలాగే నిలబెడుతుందా అనే సందేహం రాజకీయ విశ్లేషకులను వెంటాడుతుంది. నాలుగేళ్ల కిందటి వరకు చేగువేరా తన ఆదర్శమని, వేరే కులంలో పుట్టి ఉంటే బాగుండేదని... ఇలా రకరకాలుగా చెబుతూ వచ్చారు. ఆయన మూడు పెళ్లిళ్లు కూడా అతని సనాతన ధర్మం గురించి సందేహాలు లేవనెత్తుతున్నాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ బ్రహ్మచారి. మొదటి నుంచి బిజెపిని నమ్ముకున్నారు అందులోనే ఉన్నారు. బీజేపీ కూడా తనని నమ్ముకుని ఉన్న వారికి మాత్రమే ఛాన్స్ ఇస్తుంది. సిద్ధాంత భేదాలు ఉన్న వాళ్లని ఆర్ఎస్ఎస్ నిర్దాక్షిణ్యంగా పక్కన పడేస్తుంది. పవన్ భార్య క్రిస్టియన్, పిల్లలు కూడా క్రిస్టియన్లుగానే జనాలకు పరిచయం అయిపోతున్నారు. కాబట్టి పవన్ జాతీయ స్థాయిలో ఎదగడం అనేది కష్టం. ఈ సనాతన ధర్మం అనేది ఎంతవరకు పవన్‌కి మైలేజ్ ఇస్తుందో చూడాలి. దక్షిణాదిలో ఇప్పటివరకు కర్ణాటక మాత్రమే అంతో ఇంతో హిందుత్వ వైపు మళ్ళింది. బిజెపిని గెలిపించింది. మిగిలినవన్నీ బిజెపికి కొరకరాని కొయ్యలే. తెలంగాణలో ఇప్పుడిప్పుడే కమలం పార్టీ పాదం మోపుతోంది. కెసిఆర్ గానీ మళ్లీ బలం పుంజుకుంటే బిజెపికి గడ్డుకాలం తప్పదు. ఆంధ్రప్రదేశ్లో ఆ పార్టీకి ఉనికి కూడా లేదు. పవన్ వల్ల, చంద్రబాబు వల్ల మొన్న ఓ పది స్థానాలు గెలవగలిగింది కానీ లేదంటే బీజేపీ సింగిల్‌గా గెలిచే పరిస్థితి లేదు. ఇక జనసేనకు సంస్థాగతమైన నిర్మాణం లేదు బలమైన క్యాడర్ లేదు. పవన్ వెనుక మీడియా బలం లేదు. అంతకుమించి అతనికి అంటూ ప్రత్యేకమైన సిద్ధాంతం లేదు. ఇవన్నీ పవన్ పరుగుకు స్పీడ్ బ్రేకర్లు వేస్తాయేమోనని కొంతమంది సందేహం. భవిష్యత్తులో పవన్ మరింత దృఢచిత్తుడై సనాతన ధర్మానికి కట్టుబడి, రాష్ట్ర దేశ రాజకీయాలను సాధిస్తాడా అనేది కాలం నిర్ణయించాలి. ఇప్పుడైతే పవన్‌కు మహర్దశ నడుస్తోంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అసలు పవన్ చెప్పిన తర్వాత చంద్రబాబుతో బీజేపీ కలవడానికి ప్రధానమైన కారణమే హిందుత్వ అజెండాను ఆంధ్రాలో అమలుచేయడానికని ఎన్నికల ముందు విశ్లేషణలు వచ్చాయి. ఆ మాటకొస్తే లడ్డూ వివాదం కేంద్రం కనుసన్నల్లోనే జరిగిందనే టాక్ కూడా ఉంది. కేవలం నెయ్యిలో కల్తీ జరిగిందనే ఒక ప్రకటన తర్వాత చంద్రబాబు ఈ గొడవ నుంచి తప్పుకున్నారు. అప్పట్నుంచే పవన్ దీన్ని నెత్తికెత్తుకున్నారు. రేపు సిట్ నివేదికలో ఇది అసత్యమని తేలితే నష్టపోయేది పవనే గాని, ఏ పార్టీ కాదు.

## ఐఐటి చెన్నై సహకారంతో 'పద్మావతి' స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల ప్రతిష్ఠాత్మక ఐఐటి చెన్నైతో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం కోసం ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల డైరక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా తమ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు మద్రాస్ ఐఐటి అందించే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్ సర్టిఫికెట్ కోర్సులు ఆన్‌లైన్ ద్వారా పూర్తిచేసే వీలు కలుగుతుందన్నారు. 8 వారాలు నిడివి గల ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మద్రాస్ ఐఐటి సర్టిఫికెట్‌తో పాటు ఐఐటి క్యాంపస్ సందర్శించే అవకాశం ఉంటుందని తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట!

### ఎస్సీ వీధిలో మురుగులో దిగితేనే రక్షిత మంచినీరు
### మురికి కాల్వల మధ్యలో తాగునీటి కుళాయిలు



(సత్యంన్యూస్, కొత్తూరు)

నివగాం గ్రామం ఎస్సీ వీధిలో మంచినీటి కోసం మహిళలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇక్కడి ప్రజలు మంచినీటి కోసం మురికి కాల్వలో దిగాల్సిందే. వీరి పరిస్థితి చూస్తే దయనీయంగా ఉంది. ఈ రోజుల్లోనూ ఇలాంటి వాతావరణంలో జీవిస్తున్నారడానికి ఇదో తార్కాణం. నివగాం గ్రామం ఎస్సీ వీధిలో స్థానిక మహిళలు మురికి నీటి కాల్వల మద్య మంచినీటి కుళాయి దగ్గర తాగటానికి మంచి నీరు పడుతూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు వీరి కష్టాలను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానిక మహిళలు తమ గోడును వెల్లడించారు. అలాగే ఇక్కడ మంచినీరు తాగటం వల్ల తాము అనారోగ్యానికి గురవుతున్నామని, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తమ కష్టాలు తీరటం లేదని వాపోతున్నారు. ఇకనైనా తమ బాధను అర్థం చేసుకొని తక్షణమే చర్యలు తీసుకొని మంచినీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

## ఎవడైతే మాకేంటి..? పిక్కలు పీకేస్తాం!

- జాగింగ్ చేసేవారినీ పతుగెత్తిస్తున్న భైరవులు
- ప్రభుత్వాసుపత్రుల్లో యాంటీ రేబిస్ కరువు
- కుక్కల సంఖ్య పెరగడానికి కారణమేంటి?
- చర్మవ్యాధులకు కారణం బిస్కట్లేనంటున్న వైద్యులు



వీధికుక్కల నగర సంకీర్తన

సత్యంన్యూస్, శ్రీకాకుళం

మాయదారి కుక్కలు మార్నింగ్ వాక్‌కు వెళ్తుంటే రన్నింగ్ రేస్‌లో పాల్గొనేవాడిమళ్లే పరుగెత్తిస్తున్నాయి. పోనీ బైక్‌పై వెళ్తుంటే వెంటబడి తిరగేసేస్తున్నాయి. పిల్లల్ని వీధిలోని దుకాణానికి పంపితే, వారు ఇంటికి వచ్చేసరికి కుక్కల కారణంగా చిన్న గాయమైనా తగిలించుకోక తప్పడంలేదు. వారి సంగతి సరేసరి.. పెద్దవారు, అందులోనూ వీధిలోనివారమే కదాని బయటకు వస్తే ఎవరైతే నాకేంటన్న రీతిలో అవి వెంటపడుతున్నాయి. దీని గురించి పట్టించుకునేవారే లేరు. గతంలో మెర్సీ చూపకుండా కుక్కల్ని పట్టిచంపించేవారు. ఇప్పుడు గ్రీన్‌మెర్సీ పుణ్యమాని వాటి సంఖ్య పెరిగిపోయింది. ఇటీవల కుక్కలకు కు.ని. చికిత్స చేసి వీధుల్లో వదిలేస్తున్నారట. అదే నిజమైతే కుక్కల సంఖ్య ఇంత విచ్చలవిడిగా ఎందుకుంటుంది? అయితే గతంలో ఏడాది ఒకసారి పిల్లలు పెట్టే కుక్కలు ఖరీఫ్, రబీ పంటల మాదిరిగా ఏడాదికి రెండు సార్లు ఈనేస్తున్నాయి. మరి వాటికి కు.ని. చికిత్సలు చేస్తున్నారో, లేక కుక్కల సంఖ్య పెరగడానికి వయాగ్రా వేసి పంపుతున్నారో వారికే ఎరుక. ఇక పోతే టౌన్‌లో ఎక్కడ చూసినా కుక్కల చర్మంపై జుట్టు ఊడిపోయి పొట్టు రాలుతోంది. సరిగ్గా చెప్పాలంటే శంకర్ దర్శకత్వం వహించి విక్రం హీరోగా నటించిన 'ఐ' సినిమాలో హీరో మాదిరిగా ఒళ్లంతా ముడతలమయమై కనిపిస్తున్నాయి. పక్క నుంచి వెళ్తుంటే కంపుకొడుతున్నాయి. పెంచుకున్న కుక్క ప్రేమతో పళ్లు నాటితేనే వైజాగ్‌లో తండ్రీ కొడుకులు చనిపోయిన విషయం అందరికీ విదితమే. ఇక వీధి కుక్కలు, అందులోనూ గజ్జితో నిండినవి, ఎవరూ ఎప్పుడూ ఒక్క ఇంజక్షన్ కూడా వేయనివి కరిస్తే మన పరిస్థితి ఏమిటి? అసలే ప్రభుత్వాసుపత్రుల్లో యాంటీ రేబిస్ ఇంజక్షన్లు లేవని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈమధ్య జంతుకారుణ్యం మనోళ్లకి బాగా పెరిగింది. కొందరు కుక్కల ప్రేమికులు బిస్కట్లు తెచ్చి ప్రతీ సెంటర్‌లోనూ వాటికి మేపుతున్నారు. వీరు వచ్చేవరకు భైరవులు పదుల సంఖ్యలో ఉండటమే కాకుండా, అటు ఇటు వచ్చి వెళ్లేవారిని గాయపరుస్తున్నాయి. అయితే కుక్కలకు చర్మవ్యాధులు రావడానికి ఈ బిస్కట్లే కారణమని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వీటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

వైవిధ్యమైన సినిమాలతో హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు శ్రీ విష్ణు. అతడి నుంచి వచ్చిన కొత్త చిత్రం.. శ్వాగ్. ఇంతకుముందు శ్రీ విష్ణుతో 'రాజ రాజ చోర' లాంటి సక్సెస్ ఫుల్ మూవీని అందించిన హాసిత్ గోలి ఈ చిత్రాన్ని రూపొందించడంతో దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. క్రేజీ టీజర్.. ట్రైలర్లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన 'శ్వాగ్' ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.




**కథ:** ఘన చరిత్ర ఉన్న శ్వాగణిక వంశానికి చెందిన భారీ నిధిని వారి వారసులకు అందించాలని మరో వంశానికి చెందిన ప్రతినిధులు ఎదురు చూస్తుంటారు. కానీ శ్వాగణిక వంశ వారసులెవరన్నదే అంతుబట్టకుండా ఉంటుంది. ఈ స్థితిలో ఎస్ఐగా పని చేసే భవభూతి (శ్రీ విష్ణు).. అనుభూతి (రీతూ వర్మ) వేర్వేరుగా తామే శ్వాగణిక వంశ వారసులమని వస్తారు. తర్వాత వీరికి సింగ (శ్రీ విష్ణు) కూడా తోడవుతాడు. వారిలో ఎవరు నిజమైన వారసులనే విషయం తేల్చడానికి కొన్ని పరీక్షలు చేస్తారు. ఈ క్రమంలో అనేక మలుపులు చోటు చేసుకుంటాయి. ఆ మలుపులేంటి.. ఇంతకీ శ్వాగణిక వంశ చరిత్ర ఏంటి.. ఇంతకీ ఈ వంశానికి నిజమైన వారసులెవరు.. ఈ నిధి ఎవరికి దక్కింది.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

# క్రేజీ కథలో సోసో కథనం!

**కథనం-విశ్లేషణ:**

శ్వాగ్.. ఈ పేరుతో ఓ సినిమా తెరకెక్కడమే చిత్రం. దానికి 'శ్వాగణిక వంశానికి స్వాగతం' అంటూ పెట్టిన క్యాప్షన్ ఇంకా చిత్రంగా అనిపించింది. శ్వాగ్ అంటూ ట్రెండీగా అనిపించే టైటిల్ పెట్టి.. రాజులు రాజ్యాలు వంశాలు అంటూ పాత విషయాలతో కథ నడిపించడమేంటా అనే ఆశ్చర్యం ప్రేక్షకుల్లో కలిగింది. కథేంటో అర్థం కాకపోయినా క్రేజీగా అనిపించిన టీజర్.. ట్రైలర్ 'శ్వాగ్' వ్యవహారమేంటో చూడాలన్న కుతూహలం ఏర్పడింది. హాసిత్ గోలి ప్రేక్షకులు ఊహించలేని మలుపులున్న ఒక క్రేజీ కథతో విన్యాసం చేయాలని ప్రయత్నించాడు. కానీ ఐడియా ఎంత క్రేజీగా ఉన్నా.. దాన్ని అర్థమయ్యేలా.. ఆసక్తి రేకెత్తించేలా నరేట్ చేయడంలోనే సినిమా సక్సెస్ ఆధారపడి ఉంది. ఐతే ప్రేక్షకులకు కొత్తగా ఏదో ఇవ్వాలనే హాసిత్ ప్రయత్నం మెచ్చదగిందే అయినా.. ప్రేక్షకుల ఆసక్తిని నిలిపి ఉంచలేని కథనం.. సన్నివేశాల్లో గందరగోళం వల్ల 'శ్వాగ్' అంచనాలను అందుకోలేకపోయింది. అలా అని ఇది తీసిపడేయద్ద సినిమా అయితే కాదు. రొటీన్ కు భిన్నమైన సినిమా చూడాలనుకునేవారిని ఇది ఎంగేజ్ చేస్తుంది.

'శ్వాగ్' ప్రోమోలు చూస్తే ఇది ఆడ-మగ తేడాల గురించి చర్చిస్తూ.. ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు నేపథ్యంలో నడిచే కథలా అనిపిస్తుంది. దాని మీద కొంత కథ నడిచినా.. అంతకుమించిన విషయం ఇందులో ఒకటి ఉంది. ఆడ.. మగ కాని వ్యక్తులు కుటుంబం నుంచి సమాజం వరకు ఎదుర్కొనే ఇబ్బందులు.. వివక్ష గురించి ఇందులో చాలా హృద్యంగా చెప్పే ప్రయత్నం చేశాడు హాసిత్ గోలి. సమాజంలో ఆడవాళ్ల కంటే వీళ్లు ఎదుర్కొనే వివక్ష పెద్దదని.. ఇది ఇంటి నుంచే మొదలవుతుందని.. ఏ రకమైన లింగ వివక్షా సమర్థనీయం కాదని చెప్పడం ఈ కథ ఉద్దేశం. ఐతే మన మెదళ్లలో ఏళ్ల నుంచి నాటుకుపోయిన అభిప్రాయాల కారణంగా ఇలాంటి విషయాలు తెర మీద చర్చిస్తే కొంత ఇబ్బందిగా అనిపించడం సహజం. 'శ్వాగ్'ను ఒక క్రేజీ ఎంటర్టైనర్ గా భావించి థియేటర్లకు వెళ్లే ప్రేక్షకులకు ఈ అంశం షాక్ ఇస్తుంది. హాసిత్ గోలి ఒక నిబద్ధతతో ఈ టాపిక్ ను డీల్ చేశాడని అర్థమవుతుంది. కానీ వినోదాన్ని ఆశించే ప్రేక్షకులకు మెలో డ్రమటిక్ మూవీని చూపించడం రుచించకపోవచ్చు. కానీ కాస్త మనసు పెట్టి చూస్తే ఆ అంశం హృద్యంగా అనిపిస్తుంది. ఈ అంశాన్ని ప్రేక్షకులందరూ ఒకేలా తీసుకోకపోవచ్చు. అదే సమస్య.

400 ఏళ్ల కిందటి నేపథ్యంతో మొదలుపెట్టి ఇప్పటి కాలం వరకు వివిధ దశల్లో 'శ్వాగ్' కథను నడిపించాడు దర్శకుడు. శ్వాగణిక అనే వంశానికి చెందిన భారీ నిధిని ఎవరు చేసుకుంటారనే నేపథ్యంలో ఈ కథను మొదలుపెట్టిన తీరు ఆసక్తి రేకెత్తిస్తుంది. భవభూతి.. అనుభూతి.. సింగ.. ఈ ముగ్గురి పాత్రలకు సంబంధించిన బ్యాక్‌స్టోరీలతో ప్రథమార్ధం సాగుతుంది. ఇందులో భవభూతి కథ ఆసక్తి రేకెత్తిస్తుంది. తన భార్యగా చేసిన మీరా జాస్మిన్ నటన.. తన పాత్ర సినిమాకు పెద్ద బలం. ఆ ఎపిసోడ్ వరకు ఆసక్తికరంగా డీల్ చేసిన హాసిత్.. అనుభూతి.. సింగ్ పాత్రల విషయంలో మాత్రం నిరాశపరిచాడు. నరేషన్లో కన్ఫ్యూజన్ ప్రేక్షకులకు కొంత చికాకు పెడుతుంది. ఐతే పడుతూ లేస్తూ సాగే 'శ్వాగ్' ప్రథమార్ధం విరామ సమయానికి మంచి మలుపు తీసుకుంటుంది. ఆడ వేషంలో శ్రీవిష్ణు పాత్ర ప్రవేశంతో సినిమా ఆసక్తికరంగా మారుతుంది. ఇంటర్వెల్ క్రేజీగా అనిపిస్తుంది. ఇక ద్వితీయార్ధంలో ఒకప్పుడున్న మాతృస్వామ్య వ్యవస్థ గిట్టని ఓ రాజు.. దాన్ని మార్చి పితృస్వామ్య వ్యవస్థను ఎలా నెలకొల్పాడు అన్నది కొంచెం క్రేజీగా చూపించాడు హాసిత్ ఇందులో. ఐతే రాజుల కాలం నాటి ఆ ఎపిసోడ్ ఫన్నీగా అనిపిస్తుంది తప్ప కథకు అవసరమైన బలాన్ని తీసుకురాలేకపోయింది. ఇక శ్రీ విష్ణునే పోషించిన హిజ్రా పాత్ర మీదే ద్వితీయార్ధంలో చాలా వరకు కథ నడుస్తుంది. అది పూర్తిగా ఎమోషనల్ టచ్ తో సాగడం వల్ల ద్వితీయార్ధం ప్రేక్షకులకు భారంగా అనిపిస్తుంది. రానురాను కథలో వేగం మరీ నెమ్మదించ డంతో ప్రేక్షకులు బోర్ ఫీలవుతారు. కానీ తర్వాత ఏం జరుగుతుంది.. ఈ కథ ఎలా ముగుస్తుంది అనే ఆసక్తి ప్రేక్ష కులను చివరి వరకు కూర్చునేలా చేస్తుంది. పతాక సన్నివే శాలు బాగున్నాయి. అక్కడ మంచి డైలాగులు పడ్డాయి. చివరగా ఇచ్చిన సందేశం గొప్పగా అనిపిస్తుంది. ఈ కథను ఇంకా వినోదా త్మకంగా.. గందరగోళం తగ్గించి చెప్పాల్సిందనిపిస్తుంది. భిన్న పాత్ర ల్లో శ్రీ విష్ణు పెర్ఫామెన్స్ అదిరిపోయినా.. కథ కొత్తగా అనిపించినా.. ఇచ్చిన సందేశం బాగున్నా.. ఏదో మిస్ అయిన ఫీలింగ్ కలుగుతుంది 'శ్వాగ్'లో.

**నటీనటులు:** శ్రీ విష్ణుకు ఇది కెరీర్లో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా. ఐదు భిన్నమైన పాత్రలు.. వాటిలో మరెన్నో వేషాలతో అతను ప్రేక్షకులను విస్మయానికి గురి చేస్తాడు. ఏ పాత్రకు ఆ పాత్ర వేరుగా అనిపించేలా అతను పెర్ఫామ్ చేసిన తీరు అసామాన్యం. ముఖ్యంగా హిజ్రా పాత్రలో విష్ణు అప్పీయరెన్స్.. తన నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇలాంటి పాత్రను ఇంత కన్విన్సింగ్ గా చేయడం చిన్న విషయం కాదు. మిగతా పాత్రల్లోనూ తను రాణించాడు. ఆయా పాత్రలకు తగ్గట్లుగా మేకప్.. హావభావాల విషయంలో అతనెంత కష్టపడి ఉంటాడో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి భిన్నమైన కథకు ఓకే చెప్పడం కూడా అభినందనీయం. మీరా జాస్మిన్ రెండో ఇన్నింగ్స్ లో బెస్ట్ రోల్ చేసింది. ఆమె చూడ్డానికి చక్కగా అనిపించడమే కాక.. చక్కగా నటించి మెప్పించింది. రీతూ వర్మ పాత్ర అనుకున్నంత స్థాయిలో లేదు. మహారాణిగా కాసేపు ఓకే అనిపించినా.. అక్కడ తన పరిధి తగ్గిపోయింది. మోడర్న్ అమ్మా యిగా తన పాత్ర.. నటనలో ఏమంత ప్రత్యేకత కనిపించదు. దక్ష నగా ర్కర్ క్యారెక్టర్ నామమాత్రం. వడి వుక్కరసి.. గోపరాజు రమణ సహాయ పాత్రల్లో ఆకట్టుకున్నారు. సునీల్ జస్ట్ ఓకే అనిపిం చాడు. రవిబాబు.. గెటప్ శీను బాగానే చేశారు. మిగతా నటీనటులు మామూలే.

**సాంకేతిక వర్గం:** నవతరం దర్శకులు రూపొందించే ఇలాంటి వైవిధ్యమైన చిత్రాలకు వివేక్ సాగర్ ఆస్థాన సంగీత దర్శకుడు అయిపోయాడు. అతను ఎప్పట్లాగే నేపథ్య సంగీతంతో ఆకట్టుకున్నాడు. ఆద్యంతం మంచి జోష్ తో నడుస్తుంది సంగీతం. ఐతే పాటలు ఇంకా మెరుగ్గా ఉండాల్సింది. శ్రీ విష్ణు-మీరా జాస్మిన్ మధ్య వచ్చే మెలోడీ కొంచెం ప్రత్యేకంగా అనిపిస్తుంది. మిగతా పాటలు సాధారణం. వేదరామన్ శంకరన్ ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలు సినిమాకు పెద్ద ప్లస్. ఇలాంటి కథను నమ్మి రాజీ లేకుండా నిర్మించడం అభినందనీయం. హీరో-దర్శకుడు కాంబినేషన్ చూసి ఇది చిన్న సినిమా అనుకుంటాం కానీ.. ఆ ఫీలింగ్ రాకుండా రిచ్ గా తీశారు. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ హాసిత్ గోలి స్క్రిప్టు విషయంలో ఎంతో కసరత్తు చేసిన విషయం అర్థమవుతుంది. ప్రేక్షకుల అంచనాలకు అందని విధంగా కథను నడిపించాలనే అతడి తపన ప్రశంసనీయం. కానీ ఎంత కొత్తగా ప్రయత్నించినా.. అది కన్విన్సింగ్ గా ఉండడం కీలకం. 'శ్వాగ్' ఆ విషయంలోనే తడబడింది. విడివిడిగా కొన్ని ఎపిసోడ్ల వరకు ఓకే అనిపించినా.. ఓవరాల్ గా 'శ్వాగ్'తో హాసిత్ అంచనాలను అందుకోలేకపోయాడు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో..

# సాగు సాగేదెలా!



- ఆయకట్టుకు నీరందక రైతులు ఆందోళన
- నారాయణపురం కాలువకు గుర్రపుడెక్క సమస్య
- రైతులు శ్రమదానం చేసినా ఫలితం శూన్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల మండలంలోని 13 గ్రామాల పరిధిలో నారాయణపురం కుడికాలువ ద్వారా సాగునీరు అందించాలని గత నెలలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులు, రైతులు కలిసి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నవించారు. అంతకు ముందు కూటమి నాయకులు రైతులతో కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. ఆగస్టు నెలలో నిర్వహించిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో నారాయణపురం కుడికాలువ ఆయకట్టుకు నీరందడం లేదని జెడ్పీటీసీ, ఎంపీపీలు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈశ్వరరావు నారాయణపురం కుడికాలువను సందర్శించి గుర్రపుడెక్క తొలగిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ప్రత్యేక నిధులు విడుదల చేసి కొంతమేర గుర్రపుడెక్కను తొలగించారు. అయినా సమస్యకు పరిష్కారం కాలేదు. 50 కిలోమీటర్ల నారాయణపురం కుడికాలువ కింద సుమా రు 36వేల ఎకరాలు సాగవుతుంది. సంతకవిటి మండలం వాసుదేవపట్నం వద్ద ప్రారంభమయ్యే కుడి కాలువ ఎచ్చెర్ల మండలం భగీరథపురం వద్ద సముద్రంలో కలుస్తుంది. కాలువ కింద సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన ఆయకట్టుకు నీరందిస్తుంది. నారాయణపురం కాలువకు గుర్రపుడెక్క సమస్య వెంటాడుతుంది. సకాలంలో నీరందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు శ్రమదానం చేసినా ఫలితం కనిపించడం లేదు.

**13 గ్రామాలకు నీరందలేదు**

కాలువపై 60 షట్టర్లు ఉన్నాయి. ఇందులో కేవలం మూడు షట్టర్లు మాత్రమే పని చేస్తున్నాయి. మిగతా 57షట్టర్లు ఎత్తడానికి, దించడానికి అవసరమైన రెంచీలు లేక కొన్ని ఎత్తి ఉంచగా, మరికొన్ని దించేసి పెట్టేశారు. కొన్నిచోట్ల షట్టర్లను ఎత్తుకెళ్లిపోయారు. కాలువలో నీరు ఉన్నా ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అరకొర నీరందింది. సకాలంలో వర్షాలు కురవడంతో గత ఏడాది రైతులు గట్టెక్కిపోయారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు నారాయణపురం కాలువ నుంచి పూర్తిస్థాయిలో నీరందలేదు. దీనికి కారణం కాలువలో గుర్రపుడెక్క ఉండడం. గుర్రపుడెక్క తొలగించడానికి కలెక్టర్ ప్రత్యేక నిధులు మంజూరు చేసినా పూర్తి స్థాయిలో తొలగించలేదు. దీంతో కాలువలో నీరున్నా గుర్రపుడెక్క కారణంగా ఎచ్చెర్ల పరిధిలో సుమారు 10వేల ఎకరాలకు నీరందలేదు. ఎచ్చెర్లలోని ఫరీద్‌పేట మొదలు ఇబ్రహీంబాద్, తమ్మినాయుడుపేట, సనపలవానిపేట, పూడివలస, కుశాలపురం, కొత్తపేట, పొన్నాడ, ధర్మవరం, బొంతలకోడూరు, తుమ్మపేట, తోటపాలెం, ముద్దాడపేట ఆయకట్టు భూములకు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు నానా యాతన పడుతున్నారు.

**కాలువలో నీరున్నా..**


శుక్రవారం కుశాలపురం, ఇబ్రహీంబాద్‌కు చెందిన పైడి సాంబమూర్తి, సనపల నారాయణరావు, అన్నంనాయుడు ఆధ్వర్యంలో సుమారు 50మంది రైతులు మల్లయ్యపేట, తుంగపేట, బోరవానిపేట వద్ద కాలువలపై ఉన్న ఖానాల వద్ద పేరుకుపోయినా గుర్రపుడెక్కను శ్రమదానం చేసి తొలగించారు. అయినా నీరు అందే పరిస్థితి లేదు. యంత్రాల సాయంతో తొలగించాల్సిన గుర్రపు డెక్కను మాన్యువల్‌గా తొలగించడం సాధ్యం కాకపోవడంతో రైతులంతా వెనుదిరిగారు. ఈ ప్రాంతంలో ముగ్గురు ప్రజాప్రతినిధులు ఉన్నా ఎవరూ దీనిపై దృష్టి పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల నీరు వృధాగా పోతున్నా జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల షట్టర్లు ఉన్నా, వాటిని ఆపరేట్ చేయడానికి రెంచీలు లేకపోవడంతో నీరు వృధాగా పోతుందని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సాగునీరు ఆయకట్టు శివారు ప్రాంతానికి అందడం లేదని ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి గుర్రపుడెక్క సమస్యను అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక నిధులు విడుదల చేసినా వాటిని పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క తొలగించడానికి వినియోగించలేదని ఆరోపణలున్నాయి. ఖరీఫ్ చివరి దశలోకి వచ్చినా సాగునీరందనందున ఉబాలు ఎండిపోయాయని రైతులు చెబుతున్నారు.



## రౌతు, కుదుమలకు వరల్డ్ టీచర్స్ డే సత్కారాలు

(సత్యంన్యూస్, రాజాం)

రాజాంకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు రౌతు నరసింహప్పడు, సాంఘిక శాస్త్రోపాధ్యాయులు కుదుమ తిరుమలరావులకు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోను, జిల్లా కేంద్ర గ్రంథాలయంలోను నరసింహప్పడు రచించిన స్వచ్ఛ జీవనం పుస్తకం నమోదు కాబడి, పాఠకుల ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. గత ఏడాది విజయవాడ ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఈ స్వచ్ఛజీవనం పుస్తకం ప్రస్తావనకు రావడంతో పాటు, ప్రపంచ ప్రముఖులు నరసింహప్పడుని సత్కరించడం గర్వకారణమన్నారు. భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయులు శాసుబిల్లి హరిబాబు మాట్లాడుతూ తాను పనిచేస్తున్న పాఠశాలలో వినూత్నమైన రీతిలో నిరంతరం కృషి చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్న తిరుమలరావు విద్యాశాఖలో ఆణిముత్యమన్నారు. కార్యక్రమంలో యాంద్రాపు అమరనాథ్, ఐఈడీ ఉపాధ్యాయులు వడ్డాది శ్రీనివాసరావు, స్థానికులు వంజరాపు రాము, యు.జగదీష్, పాఠకులు లుకలాపు గణేష్, కారు త్రినాథరావు, ఆలుబల్లి వంశీలాల్, ముదిలి మణికంఠ నాయుడు, గర్భాపు బాలు, దీసరి రత్నకుమార్, దేబారికి విజయ్‌కుమార్, కోరాడ సాయిరాజు, బోనెల మోహనరావులు పాల్గొన్నారు.



## నిరుపేద మహిళ వైద్యానికి రూ.32 వేలు సాయం


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిరుపేద మహిళ వైద్యానికి స్మాల్ సర్వీస్ టు సొసైటీ (ఎస్ఎస్ఎస్), ఎలియన్స్ క్లబ్ మిత్ర ద్వారా రూ.32 వేలు నగదుతో పాటు, కర్లాన్ పరుపు, రైస్ ప్యాకెట్, నిత్యావసర సరుకులను అందించారు. బలగ మడ్డివీధిలో నివసిస్తున్న కలివరపు సుశీల భర్త వెంకట్రావు కరోనాలో చనిపోయారు. మూడో కుమార్తె ఊబకాయంతో పాటు థైరాయిడ్ వంటి ఆరోగ్య సమస్యలతో ఇంటి వద్దనే నిస్సహాయురాలుగా ఉంటుంది. తల్లి సుశీల కీళ్ల సమస్యలు వచ్చి నడవలేక, కుటుంబం గడవలేని పరిస్థితిలో ఉన్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న స్మాల్ సర్వీస్ టు సొసైటీ మిత్రులు, దాతలు సహాయంతో శనివారం ఆ కుటుంబసభ్యులకు సాయమందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఏదో ఒక రూపంలో ఆదుకోవాలని కోరారు.



## కొత్త జిల్లాగా పలాస

**రాష్ట్రంలో 30 జిల్లాలకు ప్రభుత్వం ప్రతిపాదన**
**2026లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందస్తు ఏర్పాట్లు**




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు ఎచ్చెర్ల వరకు ఒకే జిల్లాగా ఉన్న శ్రీకాకుళంలో ఇప్పుడు పలాస కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల భోగట్టా. నియోజకవర్గాల పునర్విభజన చట్టం ప్రకారం 2026లో కొత్త నియోజకవర్గాలు ఏర్పడనున్నాయి. ఇందులో భాగంగానే ముందుగా 26 జిల్లాలను 30జిల్లాలుగా మార్పు చేస్తున్నట్టు వినికిడి. నవ్యాంధ్రప్రదేశ్‌లో 14 జిల్లాలు ఉండగా, వైకాపా ప్రభుత్వం దాన్ని 26 జిల్లాలుగా మార్చింది. అయితే ఇందులో శాస్త్రీయత లేదని, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కొన్ని ప్రాంతాలు సుదూరంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వెళ్తాయని భావిస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా 30జిల్లాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తుంది. ఇందులో పలాస ఒక జిల్లాగా ఉండబోతుంది. 2326.31 చదరపు కిలోమీటర్ల పరిధిలో 11,48,024 జనాభా ఉన్న ఈ ప్రాంతాన్ని ఒక జిల్లాగా గుర్తిస్తున్నట్టు తెలుస్తుంది. ఆ తర్వాత నాగావళి జిల్లాగా మిగిలిన ప్రాంతానికి నామకరణం చేయనున్నారు. దీనికి జిల్లా కేంద్రంగా శ్రీకాకుళం ఉండబోతోంది. 2214.60 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 12,49,015 జనాభాకు ఈ జిల్లా ఏర్పడబోతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాల విభజన చేస్తున్నట్టు ఓ అంచనా. ఇవి కాకుండా పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు ఉంటున్నాయి. నూజివీడు, ఎన్టీఆర్ మచిలీపట్నం, కృష్ణ, గుంటూరు, తెనాలి, అమరావతి టెంపుల్‌టౌన్ కేంద్రంగా అమరరామ జిల్లా కొత్తగా ఏర్పడనుంది. పల్నాడు, మార్కాపురం, ప్రకాశం ఒంగోలు, పొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, హిందూపురం, ఆదోని జిల్లాలు ఉండగా, కర్నూలులో తుంగభద్రను, నంద్యాలను వేర్వేరు జిల్లాలుగా చేస్తున్నారు. కనిష్ఠ జనాభా 11.50 లక్షల లోపు నుంచి గరిష్టంగా 24.16 లక్షలు జనాభాను ప్రాతిపదికగా తీసుకున్నట్టు తెలుస్తుంది. ఇందులో తక్కువ పాపులేషన్ ఉన్న జిల్లా పలాస కాగా, అత్యధిక జనాభా ఉన్న జిల్లా పొట్టిశ్రీరాములు నెల్లూరు. ఇప్పుడు దీని ప్రాతిపదిక గానే నియోజకవర్గాల పునర్విభజన కానుందని తెలుస్తుంది.

## గాయత్రి మాతగా దుర్గామహాలక్ష్మి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బాకర్‌సాహెబ్‌పేటలోని శ్రీ దుర్గా మహాలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని గాయత్రీ మాతగా విశేషమైన అలంకరణ చేశారు. దుర్గా మహాలక్ష్మి అమ్మవారి ప్రధానార్చకులు తెన్నేటి సునీల్ శర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో విశేషమైన అభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన, గాయత్రి సహస్రనామ కుంకుమార్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎస్వీడీ మురళీ, ఆలయ కమిటీ మండల మన్మధరావు, సొంగలి గణేష్, బాణాల కృష్ణ, లావేటి శ్యామ్, సేవాదళ్ సభ్యులు పద్మ, రవళి, కళ్యాణి, శ్రీలక్ష్మి, స్వప్న, అంధవరపు మేనక తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి చేయూత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అనారోగ్యంతో మరణించిన హోంగార్డు జి.సురేష్ కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థిక చేయూతనందించారు. వారి ఒకరోజు వేతనంగా పోగయిన రూ.4.29లక్షల చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా శనివారం సురేష్ సతీమణి దుర్గాభవానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వివేకానంద, ఏ.ఓ. సి.హెచ్.గోపినాథ్, రిజర్వ్ సబ్‌ఇన్స్పెక్టర్ వెంకటరమణ, హోం గార్డు కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



## ఇంజినీరింగ్ విద్యార్థికి డొనేషన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బస్వా సందీప్ అనే విద్యార్థి హాస్టల్ ఛార్జీల నిమిత్తం డాక్టర్ ఆరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.5 వేలు సాయమందించారు. సాయి సందీప్ శ్రీకాకుళంలోని సత్యసాయి పెద్ద మందిరంలో దీన జనోద్ధరణ ప్రాజెక్ట్‌గా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నాడు, ఇప్పుడు ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాలలో ఇంజనీరింగ్ సీఎస్‌సీ గ్రూప్ చదువుతున్నాడు. అతను స్వతహాగా తెలివైనవాడు కావడంతో ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించాడు. అతని తల్లి టైలరింగ్ చేస్తుంది. మందిరానికి మంచి పేరు రావాలని పెద్ద మందిరం కన్వీనర్ మురళీకృష్ణ తన చదువులో ఎప్పుడూ ప్రోత్సహించేవారు. అతను చదువులో విజయం సాధించాలని కనకరాజు, ఉమ దంపతులు ఆశీర్వదించారు.



























# అంకెలను 'ఆసరా' చేసుకొని..






- రుణాన్ని మూడొంతులు చూపి ఖాతాలో జమ
- వెలుగుచూసిన గోవిందపురం క్లస్టర్ బాగోతం
- డీఆర్‌డీఏకు తెలిసినా పట్టించుకోని వైనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం క్లస్టర్‌లో మహిళా స్వయంశక్తి సంఘాల సీసీ చేతివాటం చూపించి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంకెల గారడీతో బురిడీ కొట్టించి క్లస్టర్ పరిధిలోని రెయ్యపాడు గ్రామం లోని కొత్తమ్మతల్లి గ్రూపులో ఉన్న 11 మంది సభ్యులకు ఉన్న రుణాన్ని మూడొంతులు చేసి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పెద్ద మొత్తంలో క్లస్టర్ సీసీ లబ్ధి పొందినట్లు ఆరోపణలున్నాయి. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో సీసీ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. 2019 ఏప్రిల్ ఒకటి నాటికి రాష్ట్రంలోని స్వయం శక్తి సంఘాలకు ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు దశల్లో మాఫీ చేయడానికి వైకాపా ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా స్వయంశక్తి సంఘాల రుణాలను నాలుగు దశల్లో మాఫీ చేసింది. దీన్ని ఆసరాగా చేసుకొని గోవిందపురం క్లస్టర్ పరిధిలో సీసీగా విధులు నిర్వహిస్తున్న మహిళ చేతివాటం చూపించి సుమారు రూ.3.20 లక్షలు ప్రభుత్వం నుంచి అదనంగా జమ చేయించుకున్నారు. దీంతో గోవిందపురం క్లస్టర్ పరిధిలో ఉన్న రెయ్యపాడులోని కొత్తమ్మతల్లి ఎస్‌హెచ్‌జి సభ్యులకు ఏకంగా రూ.4,33,209 ఆసరా డబ్బులు వారి ఖాతాలో జమయ్యాయి.

**రికార్డులు తారుమారు**

వాస్తవంగా కొత్తమ్మతల్లి ఎస్‌హెచ్‌జి సంఘం లోని 11 మంది సభ్యులకు 2019 ఏప్రిల్ 11 నాటికి జిల్లా మహిళా సమాఖ్య లెక్కల ప్రకారం రూ.1,10,807 రుణం ఉంది. వీరికి ఇంతే మొత్తం రుణమాఫీ జరగాల్సి ఉంది. ఒక్కో విడతలో రూ.2,900 చొప్పున నాలుగు విడతల్లో 11,600 రుణమాఫీ జరగాలి. సీసీ చేతి వాటం చూపించి రుణాన్ని మూడొంతులు ఎక్కువ చేసి సంఘంలోని 11 మంది సభ్యులకు రూ. 4,33,209 ఉన్నట్టు రికార్డులు తారుమారు చేసి చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆసరా పథకం ద్వారా ఒక్కో విడతలో రూ.9,845 చొప్పున నాలుగు విడతల్లో రూ.39,382 జమ చేయించినట్లు తెలిసింది. ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని 11 మంది సభ్యుల నుంచి రికవరీ చేసి, వాటిని మండల, జిల్లా అధికారులకు తిరిగి ఇవ్వాలని సీసీ చెప్పినట్టు గ్రామంలో చర్చ సాగుతుంది. రుణాల లెక్కలు తారుమారు చేసి ఒక్కో సభ్యురాలికి ఆసరా నాలుగు విడతల డబ్బులు రూ.39,382 బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఫిర్యాదుకు సిద్ధమవుతున్న బాధితులు**

రెయ్యపాడు గ్రామంలో ఉన్న కొత్తమ్మతల్లి సంఘం మాదిరిగా సీసీ పరిధిలో ఉన్న మిగతా సంఘాల్లోనూ ఇదే పద్ధతిలో సభ్యుల రుణాన్ని ఎక్కువగా చూపించి వారి ఖాతాల్లో ఎక్కువ మొత్తాలను జమ చేయించి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోవిందపురం క్లస్టర్ సీసీ పరిధిలో ఉన్న సంఘాల్లోని సభ్యులంతా బాధితులేనన్న ఆరోపణలు ఉన్నాయి. వైకాపా హయాంలో స్థానిక నాయకుల ప్రోద్బలంతో సీసీ అక్రమాలకు పాల్పడినట్టు విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో ఏపీఎంను బాధ్యులుగా చూస్తున్నారు. తీసుకున్న రుణానికి, ఖాతాల్లో జమైన మొత్తానికి తేడా స్పష్టంగా ఉన్నా డీఆర్‌డీఏ అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఒక సంఘంలో 11 మంది సభ్యుల ఖాతాల్లో రూ.3.20లక్షలు జమ చేయించుకొని అవక తవకలకు పాల్పడితే ఎందుకు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గోవిందపురం క్లస్టర్ పరిధిలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని విమర్శలు ఉన్నాయి. అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేయించి బాధ్యుల నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపడితే అక్రమాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఖాతాల్లో జమైన డబ్బులు వసూలుచేసి ఎవరెవరు వాటాలు వేసుకున్నారో బహిర్గతం కావాలని స్థానికులు కోరుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం క్లస్టర్ సీసీ చేతివాటంపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి రెయ్యపాడుకు చెందిన స్థానికులు సిద్ధమవుతున్నారు.

## ప్రతిఒక్కరూ బ్లడ్‌గ్రూప్ తెలుసుకోవాలి

**జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్**

(సత్యంన్యూస్, రాజాం)

ప్రతి ఒక్కరూ వారి బ్లడ్‌గ్రూప్ తెలుసుకొని, రెడ్‌క్రాస్ చేపడుతున్న వన్ మిలియన్ బ్లడ్ గ్రూపింగ్‌లో రక్త పరీక్ష చేయించుకుని, వారు అందిస్తున్న బ్లడ్‌గ్రూప్ కార్డును భద్రపరుచుకోవాలని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి. ప్రసాద్ అన్నారు. వన్ మిలియన్ బ్లడ్ గ్రూపింగ్‌లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో లక్ష మందికి గ్రూపింగ్ చేయాలనే ఉద్దేశంతో శనివారం రాజాం జీఎంఆర్ ఐటీలో నిర్వహించిన కార్యక్రమంలో 1200 మందికి బ్లడ్ గ్రూపింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్, అసోసియేట్ డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.వి.నాగేశ్వరరావు, ఏహెచ్‌వోడీలు డాక్టర్ ఆర్.ఎల్.నాయుడు, డాక్టర్ కె.శాంతారావు, ఎన్.ఎస్.ఎస్. ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్య, నంది ఉమాశంకర్, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.




## హోంగార్డ్ సిబ్బందికి చీరల పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నానుబాలవీధిలో వెలసిన ప్రముఖ దేవాలయం శ్రీ విజయదుర్గ అమ్మ వారి దేవాలయంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి సహస్ర పుష్పార్చన, ప్రత్యేక పూజ నిర్వహించామని ఆలయ ప్రధాన అర్చకులు ఆరవల్లి సూర్యనారాయణ శర్మ, ఫణిశర్మ తెలిపారు. ఈ సందర్భంగా హోంగార్డ్ సిబ్బందికి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఊర్వశి సిల్క్స్ అధినేత దేవరశెట్టి ప్రదీప్, కాంచనలత దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సూర్యనారాయణశర్మ తెలిపారు. ప్రతి రోజు అమ్మవారి దేవాలయంలో వివిధ రూపాలలో అమ్మవారి దర్శనంతో పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఫలించిన రణస్థలం మండల విద్యార్థుల

## డిగ్రీ కాలేజ్ కల



(సత్యంన్యూస్, రణస్థలం)

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాల అంశం నేడు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ డిగ్రీ కాలేజ్ ప్రారంభించడానికి ఫీజుబిలిటీ సర్వే రిపోర్ట్ పంపించవలసిందిగా శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ సురేఖను ఆదేశించారు. దీంతో శనివారం ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కొండములగాం జూనియర్ కాలేజ్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు సహకారం అందించిన నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. డిగ్రీ కాలేజ్ ప్రారంభించడానికి ముందడుగు పడేందుకు కృషి చేసిన ఎన్ఈఆర్‌కు మండల నాయకులు లంక శ్యామలరావు, పిన్నింటి బానోజీనాయుడు, దన్నాన సత్తిబాబు, స్వామినాయుడు, కాయత రమణ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వరికి ఈ-క్రాప్ తప్పనిసరి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఈ-పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాన్ని రైతులు విధిగా చేయించుకోవాలని, ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంటలను పండించే దిశగా వారిని వ్యవసాయ అధికారులు కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. తోటాడ గ్రామంలో ఖరీఫ్ వరికి ఈ-పంట నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన సర్వే నెంబర్లలోని వరిపంట పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-పంట నమోదుతో సరిపోల్చి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకుల పనితీరు, రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలపై ఆరా తీశారు. ఈ-కేవైసీ నమోదులోని లోటుపాట్లు గురించి అడిగి తెలుసుకుని రైతులకు, వ్యవసాయ శాఖ అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. డ్రోన్ల సహాయంతో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పంటల బీమా సహా నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, పీఎం కిసాన్, అన్నదాత వంటి పథకాలు అన్నీ ఈ-పంట నమోదుతోనే ముడిపడి ఉన్నాయని, అందుకే ప్రతి రైతు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-పంట ద్వారా తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ పరిశీలనకు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కోరాడ త్రినాధ స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ రజిని, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ మెట్ట మోహనరావు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుధీర్, సర్వేయర్లు, వీఆర్వోలు హాజరయ్యారు.



## ఆర్డీవోలు బాధ్యతల స్వీకరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలుగా నియమితులైన కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. 2023 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన ఈ ఇద్దరు అధికారులు ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని తొలిసారి ఆర్డీవోలుగా నియమితులయ్యారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి పోలీసు శాఖలో ఎస్సైగా పదేళ్లపాటు పనిచేసి గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. శ్రీకాకుళం ఆర్డీవో ప్రత్యూష ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ (హానర్స్)లో పట్టా పొంది చిత్తూరు జిల్లాలో పంచాయతీ సెక్రటరీగా పని చేశారు. అనంతరం గ్రూప్-1లో ఆర్డీవో కేడర్లో ఎంపికై శ్రీకాకుళం డివిజనల్ అధికారిగా విధుల్లో చేరారు.

## వైకాపా పాలనకు నిదర్శనమే ప్రజాదర్బార్ వినతులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం నియోజకవర్గ రాజకీయ చరిత్రలో సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్‌ను ఇంత వరకు నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులతో కలిసి నిర్వహించలేదని, మొదటగా శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ నిర్వహించి చరిత్ర సృష్టించారని శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. ఈమేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్ మొదటి విడతగా వివిధ సమస్యలపై 340 వినతి పత్రాలు వచ్చాయని తెలిపారు. వీటిలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు డీడీలు తీసి ఇళ్లు పొందినా గత వైకాపా ప్రభుత్వం వారికి కాకుండా నచ్చినవారికి ఇచ్చి వీరిని రోడ్డున పడేసిందన్నారు. కొందరిపై టీడీపీ ముద్ర వేసి అర్హతలున్నా పెన్షన్లు రద్దు చేశారని పలు ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే రేషన్ కార్డులు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు అందించారని తెలిపారు. ఈ వినతులను పరిశీలిస్తే గత వైకాపా ప్రభుత్వంలో ప్రజలు ఏ విధంగా ఇబ్బందులకు గుం ˇయ్యారో అర్థమవుతుందన్నారు.


# అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300, 98487 96626

# ICL COURIER

INTERNATIONAL COURIER & CARGO

విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు

పచ్చళ్లు, బట్టలు, పిండివంటలు, బుక్స్, స్వీట్స్, మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.

- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing

దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.

9989172822, 9505944472, 9248199493





## అన్నపూర్ణగా అమ్మవారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

కిష్టప్పపేటలోని శ్రీ పార్వతీ సమేత కైలాశేశ్వం స్వామి దేవస్థాన సముదాయంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. శ్రీచక్ర మహామేరువుకు పంచామృతాభిషేకం, అన్నపూర్ణ అష్టోత్తర శతనామార్చన, లలిత సహస్రనామ కుంకుమార్చన, శ్రీ అన్నపూర్ణదేవి మూల మంత్ర హోమం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు, శ్రీ విద్య ఉపాసకులు రంప జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు గొండు జగన్నాథరావు(జగపతి), అతని కుమారులు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు, డాక్టర్ గొండు గంగాధరరావు దంపతుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## 12 వరకు దేవీ నవరాత్రి మహోత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని 80అడుగుల రోడ్డులో దుర్గా నవరాత్రి మహోత్సవాలు ఈనెల 12 వరకు కొనసాగుతాయని సంప్రదాయం వెడ్డింగ్ ఈవెంట్స్ ప్రతినిధులు బల్లాడ తరుణ సాయిరెడ్డి, బల్లాడ గణేష్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి వరకు అమ్మవారి పేరిట ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నట్టు పేర్కొన్నారు. 5న రాత్రి ఏడు గంటల నుంచి భజన, 6న సాయంత్రం ఏడు గంటల నుంచి 8 గంటల వరకు కోలాటం, 8 గంటల నుంచి పది గంటల వరకు సంప్రదాయ నృత్యాలు, 7న 11 జంటలతో కుంకుమ పూజలు, 8న సాయంత్రం పలు సన్నిధానాలతో కలిసి భవానీల భజనలు, 9న హోమం, 10న 108 జంటలతో లక్ష గాజుల పూజ, 11న 2వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ, 12న దీపారాధన అనంతరం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు మరింత విజయవంతంగా నిర్వహిస్తామని తరుణసాయిరెడ్డి, గణేష్ రెడ్డి పేర్కొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.